క్లుప్తంగా

కర్నూలుకు వెళ్లి పింఛన్ అందజేత


డయాలసిస్ రోగికి పింఛన్ అందజేస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్

పాములపాడు: పాములపాడుకు చెందిన గోపాల్‌రెడ్డి కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతూ కర్నూలు ఆస్పత్రిలో డయాలసిస్ చేసుకుంటున్నాడు. విషయం తెలుసుకున్న వెల్ఫేర్ అసిస్టెంట్ శ్రీనివాసులు, గ్రామ వలంటీర్ రవికుమార్ కర్నూలుకు వెళ్లి రూ.10,000 పింఛన్ నగదును అందజేశారు. వారికి గోపాల్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపాడు.

ఓంకారంలో శివరాత్రికి పోలీసు బందోబస్తు

మహానంది: శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఓంకారం పుణ్యక్షేత్రంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తామని నంద్యాల డీఎస్పీ రవీంద్రనాథ్ రెడ్డి తెలిపారు. సీఐ శివకుమార్‌రెడ్డి, ఎస్‌ఐ మల్లికార్జునతో కలిసి ఆదివారం ఓంకారంలో ఏర్పాట్లను పరిశీలించారు. డీఎస్పీ మాట్లాడుతూ వేలాది సంఖ్యలో వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా బందోబస్తు ఉంటుందని, పార్కింగ్ కష్టాలు లేకుండా చూస్తామని చెప్పారు. అనంతరం బోధనం గ్రామంలో ప్రజలతో సమావేశం నిర్వహించారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం

నందికొట్కూరు: పట్టణంలోని కోటవీధిలో త్రైత సిద్ధాంత భగవద్గీత గ్రంథంపై ప్రబోధ సేవా కమిటీ సభ్యులు ఆదివారం ప్రచారం నిర్వహించారు. ఈ నెల 8వ తేదీ మహాశివ రాత్రి పండుగను పురస్కరించుకుని త్రైత సిద్ధాంత భగవద్గీత, అనుబంధ గ్రంథాలపై ప్రచారం చేశారు. సమితి సభ్యులు రామచంద్రుడు, మునిదాసు, వెంకటేశ్వర్లు, నాగమద్దిలేటి, శేషన్న, సంజీవ, పార్థసారథి, సుబ్బలక్ష్మి, సుజాత, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో పూరిగుడిసె దగ్ధం

పాములపాడు: షార్ట్ సర్క్యూట్‌తో పూరిగుడిసె దగ్ధమైన సంఘటన మండలంలోని జూటూరు గ్రామంలో ఆదివారం జరిగింది. గ్రామస్తులు వివరాల మేరకు.. గ్రామానికి చెందిన జనార్దన్‌గౌడు ఆదివారం ఉదయం కర్నూలుకు వెళ్లారు. కుటుంబ సభ్యులు పని నిమిత్తం బయటకు వెళ్లారు. ఈ క్రమంలో ఇంటిపైన ఉన్న విద్యుత్ తీగలు తగలడంతో మంటలు చెలరేగాయి. ఇంట్లోని సామగ్రి అగ్నికి ఆహుతైంది. ఆత్మకూరు ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించడంతో అగ్నిమాపక సిబ్బంది శ్రీనివాసనాయక్, గౌస్, కరిముల్లా, అన్సర్ సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. కాగా సుమారు రూ.2 లక్షలు నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపాడు.

నీటి సమస్యకు పరిష్కారం

కొత్తపల్లి: వేసవి కావడంతో గ్రామంలో తాగు నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు నాగంపల్లి సొసైటీ చైర్మన్ గౌరు జనార్దన్ రెడ్డి అన్నారు. ఆదివారం ఎర్రమఠం గ్రామంలో పైప్‌లైను వేయించారు. శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి ఆర్థిక సహాయంతో పైప్‌లైన్ వేయించామని తెలిపారు. గ్రామ శివారులోని బోరు వద్ద నుంచి పైప్‌లైన్‌కు అనుసంధానం చేసినట్లు చెప్పారు.


ముసలిమడుగులో..

కొత్తపల్లి: శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి సహకారంతో గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారం అయ్యిందని మహబూబ్ బాషా అన్నారు. ముసలిమడుగు గ్రామంలో కొంత కాలంగా తాగునీటి సమస్య ను సిద్ధార్థరెడ్డి దృష్టికి తీసుకెళ్లగా బోరు, మోటర్, పైప్‌లైన్ కోసం సహకరించారని చెప్పారు.

పకడ్బందీగా టీసీజీ వ్యాక్సినేషన్ సర్వే

జూపాడుబంగ్లా: అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని అదనపు జిల్లా వైద్యాధికారిణి శారదాబాయి ప్రాథమిక వైద్య సిబ్బందిని ఆదేశించారు. ఆదివారం మండలంలోని తంగడంచ ఆరోగ్య ఉపకేంద్రాన్ని ఆమె తనిఖీ చేశారు.

వెండి దారా పాత్ర అందజేత


ఈఓకు దారా పాత్రను అందిస్తున్న దాత

మహానంది: మహానందీశ్వరస్వామి వారికి నంద్యాలకు చెందిన మారం వెంకటసుబ్బయ్య, శమంతకమణి దంపతులు 1.25 కిలోల వెండి దారా పాత్రను బహూకరించారని ఆలయ ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక అలంకార మండపంలో ఈఓ చంద్రశేఖర్ రెడ్డి, ఆలయ ప్రధానార్చకులు మామిళ్లపల్లి అర్జునశర్మ, వేదపండితులు రవిశంకర అవధాని ఆధ్వర్యంలో పాత్రను అందజేశారు.

భక్తులకు వైద్య శిబిరం ఏర్పాటు

జూపాడుబంగ్లా: కాలినడకన శ్రీశైలం వెళ్లే పాదయాత్రికుల కోసం జూపాడుబంగ్లా తహసీల్దార్ కార్యాలయం ఎదుటనున్న కేజీరోడ్డుపై వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు పీహెచ్‌సీ డాక్టర్ సభా తెలిపారు. పాదయాత్రికులకు మందులు పంపిణీ చేశారు.

వాటర్ ప్లాంట్ ప్రారంభం

వెలుగోడు: పట్టణంలోని మక్కా మసీదు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఎంపీడీఓ సయ్యద్ ఉమర్, మత పెద్దలు మౌలానా మహబూబ్, రెహ్మాన్ ఆదివారం ప్రారంభించారు. ముత్తవల్లి కే శంషుద్దీన్ మాట్లాడుతూ.. కూల్ వాటర్ కూడా ఉంటుందన్నారు .ప్రార్థనలకు వచ్చే వారితో పాటు పట్టణ ప్రజలు, రోడ్డుపై వెళ్లేవారు, పర్యటకులు నీటిని ఉపయోగించుకోవచ్చన్నారు.


ఇరుముడి సమర్పిస్తున్న మాలధారులు


పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు


నల్లమల అటవీప్రాంతంలో పాదయాత్ర చేసుకుంటూ వస్తున్న భక్తులు


మల్లన్న దర్శనానికి వెళ్తున్న శివస్వాములు

ఇలకైలాసం.. బ్రహ్మోత్సవ శోభితం

- శ్రీశైలంలో మారుమోగుతున్న శివనామస్మరణ
- కొండనిండా భక్తులు
- నల్లమల అడవుల్లో పాదయాత్రగా మల్లన్న చెంతకు
- స్వామిఅమ్మవార్ల దర్శనానికి బారులుదీరిన భక్తులు


ఉచిత కంపార్ట్‌మెంట్లలో వేచిఉన్న భక్తులు


అన్నదాన భవనంలో భక్తులకు అన్నప్రసాద వితరణ చేస్తున్న ఈఓ

శ్రీశైలంటెంపుల్: బ్రహ్మోత్సవాలతో ఇలకైలాసం శోభిల్లుతోంది. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని భ్రమరాంబా సమేత మల్లికార్జున స్వామి అమ్మవార్లను దర్శించుకునేందుకు భక్తులు తండోపతండాలుగా శ్రీగిరి చేరుకుంటున్నారు. స్వామిఅమ్మవార్లకు జరిగే వాహన సేవలను కనులారా దర్శించి కర్పూర నీరాజనాలు సమర్పించి తరిస్తున్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి సైతం భక్తులు భారీగా తరలివస్తున్నారు. పాతాళగంగలో పుణ్య స్నానాలు ఆచరించి, కృష్ణమ్మ ప్రత్యేక వాయనం సమర్పించి స్వామిఅమ్మవార్ల దర్శనానికి బారులుదీరుతున్నారు. భక్తుల రద్దీతో ఉచిత, శీఘ్ర, అతిశీఘ్ర దర్శన క్యూలైన్లు నిండిపోయాయి. జ్యోతిర్ముడి కలిగిన శివ మాలధారులకు ప్రత్యేక క్యూలైన్ ద్వారా స్వామివారి స్పర్శ దర్శనాన్ని కల్పిస్తున్నారు. భక్తుల శివ నామస్మరణతో నల్లమల గిరులు మారుమోగుతున్నాయి. క్షేత్ర పరిధిలో ఎటుచూసినా భక్తజనమే. నల్లమల అటవీప్రాంతం నుంచి 40 కిలోమీటర్లు పాదయాత్ర చేసుకుంటూ మల్లన్న చెంతకు చేరుకుంటున్నారు. సామాన్య భక్తులకు ఆలయ క్యూలైన్లలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా దేవస్థాన అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.

బ్రహ్మోత్సవ ఏర్పాట్ల పరిశీలన

శ్రీశైలంటెంపుల్: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ఏర్పాట్ల పర్యవేక్షణలో భాగంగా ఆదివారం దేవస్థాన కార్యనిర్వహణాధికారి అన్నప్రసాద వితరణ, పలు పార్కింగ్ ప్రదేశాలు, ప్రధాన కూడళ్లు తదితర వాటిని పరిశీలించారు. అన్నదాన భవనంలో భక్తులు వేచి ఉండే గదులు, అన్నదాన ప్రదేశాలు, వంటశాల మొదలైన వాటిని తనిఖీ చేశారు. రద్దీని అనుసరించి అన్నప్రసాద వితరణ జరిపిస్తుండాలని సూచించారు. క్షేత్ర పరిధిలో పలుచోట్ల స్వచ్ఛంద సేవాకర్తలు అన్నదానం చేస్తున్నారని వారికి కూడా దేవస్థానం తరపున సహకారం అందిస్తున్నామని చెప్పారు. అనంతరం యజ్ఞవాటిక, గణేశసదన్, విభూతిమఠం, ఆగమ పాఠశాల ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పార్కింగ్ ప్రదేశాలను పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో నిరంతరం మంచినీటి సరఫరా జరిగేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అనంతరం టోల్‌గేట్ కూడలి, మల్లికార్జున సదనం కూడలి, వైద్యశాల కూడలిలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా పోలీసు శాఖ సమన్వయంతో తగు జాగ్రత్తలు తీసుకోవాలని భద్రతా విభాగం అధికారులకు సూచించారు.

శరణబసవ సత్రంలో అన్నదానం

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని శ్రీశైలంలోని శరణబసవేశ్వర సదా శివయ్య సత్రంలో నేతి మహేష్ ఆధ్వర్యంలో ఆదివారం నుంచి బ్రహ్మోత్సవాలు పూర్తయ్యేంత వరకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. బ్రహ్మోత్సవాలకు తరలివచ్చిన భక్తుల సౌకర్యార్థం ప్రతిరోజు మధ్యాహ్నం 12.30 గంటలకు, రాత్రి 7.30 గంటల నుంచి అన్నప్రసాద వితరణ చేస్తామని నిర్వాహకులు తెలిపారు.

ఉచిత వైద్య శిబిరాలు

శ్రీశైలంప్రాజెక్ట్: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు శ్రీశైలం వచ్చే భక్తుల కోసం టూరిస్ట్ బస్టాండ్, కైలాసద్వారం , పెద్దచెరువు ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేసినట్లు శ్రీశైలం బ్రాంచ్ చైర్మన్ ఎస్.నాగశేషు తెలిపారు. ఆదివారం టూరిస్ట్ బస్టాండ్ వద్ద శివభక్తులకు ప్రాథమిక వైద్యంతో పాటు మందులు పంపిణీ చేశారు.




ఉభయ దేవాలయాల్లో వివిధ రకాల పుష్పాలతో సుందరంగా అలంకరణ


భక్తులకు భోజనాలు వడ్డిస్తున్న నిర్వాహకులు

నెరవేరిన ముస్లింల కల


శిల్పా సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ కార్యకర్తలు

- షాదీఖానాను ప్రారంభించిన ఎమ్మెల్యే శిల్పా
- నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవం


చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న ఎమ్మెల్యే

ఆత్మకూరు: పట్టణంలో ఎన్నో దశాబ్దాలుగా నిరుపేద ముస్లింలు ఎదురు చూస్తున్న షాదీఖానా కల నెరవేరిందని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి పేర్కొన్నారు. నూతన షాదీఖానాను ఎమ్మెల్యే ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో తనయుడు శిల్పాకార్తీక్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా, శ్రీశైలం పరిశీలకుడు హబీబుల్లాతో కలిసి మాట్లాడారు. షాదీఖానా లేక పేద ముస్లిం కుటుంబ సభ్యులు ఎంతగానో ఇబ్బందులు పడ్డారని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.2కోట్లు మంజూరు చేయడంతో నిర్మాణం పూర్తి చేశామన్నారు. మరిన్ని పనులు చేసేందుకు సీఎం మరో రూ.2కోట్లు మంజూరు చేశారు. వాటితో మరింత అభివృద్ధి చేస్తామని చెప్పారు. నియోజకవర్గంలో బూతులు మాట్లాడేవారు అధికమయ్యారని, వారికి ఓటుతోనే బుద్ధి చెప్పాలని కోరారు. అంతకు ముందు కొత్తపేట మసీదు నుంచి నంద్యాల టర్నింగ్ మీదుగా కొత్త షాదీఖానా వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ పట్టణ, మండల అధ్యక్షులు సయ్యద్‌మీర్, రాజమోహన్‌రెడ్డి, నియోజకవర్గ నాయకుడు శిల్పా భువనేశ్వర్‌రెడ్డి, గౌస్‌లాజం, విజయచౌదరి, కువ్వాడ భాస్కర్, మునీర్‌బాషా, కుందూరు శివారెడ్డి, వరాల మాలిక్, ఫరూక్, మాజీ చైర్మన్ నూర్‌మహమ్మద్, జయకృష్ణ, అంజాద్‌అలీ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులుప్రారంభం..

నూతన ఆర్టీసీ ప్రాంగణం, వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. బస్టాండ్ ఆధునీకరణకు రూ.1.30 కోట్లతో కొత్త ప్లాట్‌ఫారాలు, సిమెంట్ బెడ్‌లతో ఏర్పాటు చేశామన్నారు. అలాగే రూ.80 లక్షలతో 21వ వార్డులో డాక్టర్ వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించామన్నారు. త్వరలోనే నూతన మున్సిపల్ కార్యాలయాన్ని ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్ రెడ్డి మంజూరు చేసిన రూ.3కోట్లతో భూమి పూజ చేయనున్నట్లు చెప్పారు. ఆర్టీసీ ఆర్‌ఎం రజియా బేగం ఉన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక..

పట్టణంలోని 15వ వార్డులో ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి సమక్షంలో శ్యామ్, ప్రతాప్ ఆధ్వర్యంలో పలువురు పార్టీలో చేశారు. వార్డుకు చెందిన అనిల్, విజయ్, నాగరాజు, సునిల్, సుందరం, చిన్న, టైలర్‌రవి, పుల్లయ్య, రాజు, అమ్మమ్మ, నిర్మల, రమణమ్మ, సన్ని, హబీబుల్లా, కలీముల్లా, మరియమ్మ, దానమ్మ, దేవయ్య, కరుణమ్మ, సామన్నల ఆధ్వర్యంలో దాదాపు 100 కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. భాస్కర్, విజయచౌదరి, అంజాద్‌అలీ, సయ్యద్‌మీర్ పాల్గొన్నారు.


ఆత్మకూరులో ముస్లింలతో కలిసి ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే శిల్పా, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా

రెండు చుక్కలతో జీవితాలను నిలబెడదాం


గాజులపల్లె స్టేషన్ శిబిరాన్ని పరిశీలిస్తున్న డీడీ, డీఎంఅండ్‌హెచ్‌ఓ


పోలియో చుక్కలు వేస్తున్న మున్సిపల్ చైర్మన్ సుధాకర్‌రెడ్డి


పోలియో చుక్కలు వేస్తున్న జెడ్పీటీసీ దివ్య


శ్రీశైలంలో చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న దేవస్థాన ఈఓ


చిన్నారికి చుక్కలు వేస్తున్న ఐటీడీఏ పీఓ


నందికొట్కూరులో చుక్కలు వేస్తున్న అడిషనల్ డీఎంహెచ్‌ఓ

కొత్తపల్లి: చిన్నారులకు రెండు పోలియో చుక్కలు వేయించి వారి జీవితాలను నిలబెడదామని ఎంపీడీఓ జవహర్‌బాబు, వైద్యాధికారులు దీపానాగవేణి, విజయేంద్ర, జబీర్ బాషా అన్నారు. ఆదివారం మండలంలోని కొత్తపల్లి, గోకవరం, ఎర్రమఠం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని గ్రామాల్లో పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహించారు. కొత్తపల్లి పీహెచ్‌సీ పరిధిలో 1549 మంది చిన్నారులు ఉండగా 1471 మందికి, గోకవరం పీహెచ్‌సీ పరిధిలో 1036 మంది చిన్నారులకు గాను 985 మందికి, ఎర్రమఠం పీహెచ్‌సీ పరిధిలో 874 మంది చిన్నారులు ఉండగా 856 మందికి చుక్కలు వేసినట్లు వైద్యాధికారులు తెలిపారు.

సంపూర్ణ ఆరోగ్యం కోసమే..

నందికొట్కూరు రూరల్: చిన్నారుల సంపూర్ణ ఆరోగ్యం కోసం పోలియో చుక్కలు వేయించాలని అడిషనల్ డీఎంహెచ్‌ఓ శారదాబాయి అన్నారు. బ్రాహ్మణకొట్కూరు పీహెచ్‌సీలో పోలియో చుక్కల కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. . వైద్యులు తులసీ రాణి, ఎంఎల్‌హెచ్‌పీ సుప్రియ ఎంజెల్ పాల్గొన్నారు.

నిండు జీవితానికి రెండు చుక్కలు

పగిడ్యాల: నిండు జీవితానికి రెండు పోలియో చుక్కలు అవసరమని జెడ్పీటీసీ సభ్యురాలు పుల్యాల దివ్య అన్నారు. మండలంలో 26 బూత్‌లను ఏర్పాటు చేసి 3,142 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేసినట్లు తెలిపారు. 98 శాతం పూర్తయిందని వైద్యాధికారి మోహన్ తెలిపారు.

పాములపాడులో 95 శాతం

పాములపాడు: మండలంలో 95 శాతం పిల్లలకు పోలియో చుక్కలు వేసినట్లు డాక్టర్లు నాగలక్ష్మి, గులాబ్‌షా తెలిపారు. ఐదేళ్లలోపు పిల్లలు 3,989 మంది ఉన్నట్లు తెలిపారు. 28 బూత్‌లు ఏర్పాటు చేసి 112 మంది సిబ్బంది, 3 సూపర్‌వైజర్లు, ఇద్దరు డాక్టర్లు పోలియో చుక్కలు వేశారు.

మిడుతూరులో 97.4 శాతం

మిడుతూరు: మండలంలో 2,663 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయాల్సి ఉండగా 2,596 మందికి(97.4 శాతం) చుక్కలు వేసినట్లు కడుమూరు మెడికల్ ఆఫీసర్ సురేష్ బాబు తెలిపారు. తలముడిపి గ్రామంలో ఎంపీపీ మల్లు వెంకటేశ్వరమ్మ పిల్లలకు చుక్కలు వేశారు.

నందికొట్కూరులో 91.48 శాతం

నందికొట్కూరు: పోలియో మహమ్మారిని తరిమికొట్టాలని మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి, పీహెచ్‌సీ వైద్యురాలు షైనీ ప్రియాంక అన్నారు. నందికొట్కూరు పీహెచ్‌సీ పరిధిలో 5,718 మంది పిల్లలకు గాను 5,231 మందికి పోలియో చుక్కలు వేశారు.

మహానంది: పోలియో రహిత సమాజ నిర్మాణమే ధ్యేయంగా ప్రభుత్వం కృషి చేస్తుందని వైద్య ఆరోగ్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ రామనాథం, డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ వెంకటరమణ తెలిపారు. మహానంది మండలంలో జరుగుతున్న పల్స్ పోలియో కేంద్రాలను ఆదివారం పరిశీలించారు. తిమ్మాపురం, గాజులపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఒకేరోజు 7,771 మందికి పల్స్‌పోలియో చుక్కలు వేసి 98 శాతం పూర్తి చేసినట్లు చెప్పారు.

వెలుగోడు: పిల్లలకు పోలియో చుక్కలు వేయించడం వల్ల ఆరోగ్యవంతంగా తయారవుతారని వేల్పనూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ జహీర్ వలి తెలిపారు. రేగడగూడురు గ్రామంలో వైఎస్ ఆర్‌సీపీ మండల అధ్యక్షుడు అంబాల ప్రభాకర్‌రెడ్డి పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. వేల్పనూరు పీహెచ్‌సీ పరిధిలో 1978 పిల్లలకు గాను 1,899 చిన్నారుకుల చుక్కలు వేసినట్లు వైద్యాధికారి తెలిపారు.

శ్రీశైలంప్రాజెక్ట్: పోలియో రహిత దేశంగా తీర్చిదిద్దవలసిన బాధ్యత మనందరిపై ఉందని శ్రీశైలం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి డాక్టర్.బి.రవీంద్రారెడ్డి అన్నారు.

శ్రీశైలం: క్షేత్రవ్యాప్తంగా 10 కేంద్రాలు ఏర్పాటు చేసి చిన్నారులకు ఆదివారం పోలియో చుక్కలు వేశారు. డాక్టర్ సిహనాజ్, శ్రీవాని, స్థానిక ఆశ వర్కర్లు, వీఆర్‌ఓ ప్రదీప్, పీ.ఎస్.బాలు నాయక్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మహానంది: బండిఆత్మకూరు మండలంలో పల్స్‌పోలియో విజయవంతంగా నిర్వహించినట్లు డాక్టర్ భావన తెలిపారు. పార్నపల్లెలో సర్పంచ్ షేక్ షబ్బీర్ అహమ్మద్, ఉప సర్పంచ్ రామలింగేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమం ఏర్పాటు చేశారు.

పొగాకు తోరణాలు దగ్ధం

పగిడ్యాల: పొలంలో ఓ రైతు ఆరబెట్టిన పొగాకు తోరణాలకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించడంతో దిగుబడి బూడిదైంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పగిడ్యాల గ్రామానికి చెందిన రైతు సుధాకర్ మూడు ఎకరాలలో పొగాకు సాగు చేశాడు. 25 రోజుల క్రితం పొగాకు ఆకులు కోసి పొలంలోనే 1,200 తోరణాలు కుట్టి ఆరబెట్టాడు. ఎండలు అధికంగా ఉన్నందున పొగాకు ఎండిందో లేదో చూసేందుకు పొలానికి వెళ్లాడు. అయితే తోరణాలపై టార్పాలిన్ పట్టాలు వేసి నిప్పటించడంతో కాలిబూడిదైంది. దాదాపు 450 తోరణాలు దగ్ధం కావడంతో రూ. 1.50 లక్షల ఆస్తినష్టం వాటిల్లింది. జరిగిన ఘటనపై ముచ్చుమర్రి పోలీసులకు ఫిర్యాదు చేయగా పొలానికి వెళ్లి ప్రమాద ఘటనపై ఆరా తీశారు. మాజీ జెడ్పీటీసీ పుల్యాల నాగిరెడ్డి,సర్పంచ్ పెరుమాళ్ల శేషన్న, ప్రమాద స్థలానికి వెళ్లి బాధిత రైతును పరామర్శించారు.


కాలి బూడిదైన పొగాకు

పాదయాత్రికుల సేవలో ఉపాధ్యాయులు


భక్తులకు అన్నదానం చేస్తున్న ఉపాధ్యాయులు


భక్తులకు భోజనం వడ్డిస్తున్న సీఈ కాంతారావు

పాములపాడు: ఉపాధ్యాయులంటే పాఠశాలల్లో పిల్లలకు విద్యా బుద్ధులు నేర్పించడమే కాదు సేవా కార్యక్రమాల్లో తమ వంతు పాత్ర పోషిస్తామంటున్నారు. ఒక్కరిలో మొదలైన ఆలోచన దాదాపు 30 మందికిపైగా ఒకటై, ఒక్క రోజు అనుకున్న అన్నదాన కార్యక్రమం 14 ఏళ్లుగా కొనసాగిస్తున్నారు. విధుల్లో భాగంగా వేర్వేరు ప్రాంతాల్లో పని చేస్తున్నప్పటికీ శివరాత్రి పర్వదినానికి ముందు ఆదివారం వీలు కుదుర్చుకుని ఉపాధ్యాయులు ఒక్క చోటకు చేరి జూటూరు గ్రామ సమీపంలోని నాగసాయి ఆశ్రమం వద్ద ఈ కార్యక్రమాన్ని సాగిస్తూ శభాష్ అనిపించుకుంటున్నారు. ఉపాధ్యాయులు గోపాల్, వెంకటరాముడు, నాగరాజు, భగవాన్, శేషయ్య తదితరులు ఉన్నారు.

జెన్‌కో ఆధ్వర్యంలో అన్నదానం

శ్రీశైలంప్రాజెక్ట్: ఏపీ జెన్‌కో ఆధ్వర్యంలో డ్యాం వ్యూ పాయింట్ వద్ద శివభక్తులకు ఆదివారం అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. మహాశివరాత్రి సందర్భంగా శ్రీశైలంకు వచ్చే భక్తుల కోసం చీఫ్ ఇంజినీరు కాంతారావు భక్తులకు భోజనాలు వడ్డించారు. మహాశివరాత్రికి ముందు రోజు గురువారం వరకు భోజన సదుపాయం అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు.

నేడు ఎమ్మెల్యే శిల్పా పర్యటన

మహానంది: బండిఆత్మకూరు మండలంలోని భోదనం, పెద్దదేవలాపురం, సంతజూటూరు, చిన్నదేవలాపురం గ్రామాల్లో నూతనంగా నిర్మించిన రైతు సేవా సహకార సంఘం లిమిటెడ్ గోడౌన్లను ఎథిక్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి సోమవారం ప్రారంభించనున్నారని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బారెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ పార్నపల్లెలో పేదలకు ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ పత్రాలను ఉదయం పంపిణీ చేస్తారని, వివిధ గ్రామాల్లో నిర్మించిన నూతన భవనాలను ప్రారంభించిన అనంతరం పార్నపల్లెలోని టీటీడీ కల్యాణ మండపంలో మధ్యాహ్నం రెండు గంటలకు బూత్ కన్వీనర్లు, గృహసారథులతో సమావేశం ఉంటుందని చెప్పారు.

మోడల్ స్కూల్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

జూపాడుబంగ్లా: స్థానిక మోడల్‌స్కూల్‌లో ఆరో తరగతి ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ రమేష్ అన్నారు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ.. ఈ నెల 31 తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఏప్రిల్ 21న తెలుగు, ఇంగ్లిష్ మాధ్యమాల్లో ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలిపారు. ప్రవేశ పరీక్ష కోసం ఓసీ, బీసీ విద్యార్థులు రూ.150, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.75 చెల్లించి దరఖాస్తును ఆన్‌లైన్ చేసుకోవాలన్నారు. ప్రవేశ పరీక్షలో మార్కులు, రిజర్వేషన్ ఆధారంగా సీట్లు కేటాయిస్తామని తెలిపారు.